సాక్షి నల్లగొండ

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



మైనర్లను కొట్టారని ధర్నా

మైనర్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారని పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. - 8లో



ఉపాధ్యాయుల నిరసన బాట

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు నిరసన బాట పట్టారు. - 8లో



క్రమశిక్షణతో మెలగాలి

వైద్యవృత్తిని ఎంచుకున్న విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

బీఎస్ఎన్ఎల్ బకాయిలకు రాయితీ వర్తింపు

రామగిరి(నల్లగొండ) : బీఎస్ఎన్ఎల్ బకాయిలకు రాయితీ వర్తింపజేసినట్లు జనరల్ మేనేజర్ పి.వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా భువనగిరి, చౌటుప్పల్, దేవరకొండ, కోదాడ, నల్లగొండ, సూర్యాపేట, హుజూర్‌నగర్ కోర్టుల పరిధిలోని బీఎస్ఎన్ఎల్‌కు బకాయి పడిన వినియోగదారులు రాయితీలు పొంది బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. ఇప్పటికే వారికి నోటీసులు పంపామని.. బకాయిలు చెల్లించి భవిష్యత్‌లో న్యాపరమైన సమస్యలు తలెత్తకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ కంటే ముందుగా బకాయిలను చెల్లించుకోవాలనుకునే వారు ఆర్.రామకృష్ణ 9440000726, పి.నవీన్‌కుమార్ 8500808879, డి.నాగరాజు 9441000163 ఫోన్ నంబర్ల సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల తనిఖీ



కృష్ణ ఆదిత్యకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ సుధారాణి

నల్లగొండ : నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్ కృష్ణ ఆదిత్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణి స్వాగతం పలికారు. విద్యా డైరెక్టర్.. విద్యార్థుల, అధ్యాపకుల హాజరు శాతం, కళాశాలలోని రికార్డులు పరిశీలించారు. పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులను అధ్యాపకులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి చెల్లించేలా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్ఓ

కొండమల్లేపల్లి : మ్యాచర్ వచ్చిన వడ్లను వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. గురువారం కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని పలు పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులను సందర్శించి అక్కడ ఉన్న వడ్లను పరిశీలించారు. రాష్ట్రంలో సీఎంఆర్ విషయంలో నల్లగొండ మొదటి స్థానంలో ఉందన్నారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల మేనేజర్ హరీష్, దేవరకొండ డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, నాంపల్లి ఆర్ఐ సీఎస్ సైదులు, సీఈఓ తిరుపతిరెడ్డి, మిల్లు యజమానులు ఉన్నారు.

శాస్త్రీయతతో కూడిన పరిశోధనలు అవసరం



మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్ : దేశ అభివృద్ధికి శాస్త్రీయతతో కూడిన పరిశోధనలు అవసరమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో యువ అధ్యాపకులు, పరిశోధకులకు రిసెర్చ్ మెథడాలజీపై నిర్వహించిన శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా అనేక సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కార మార్గాలను చూపాల్సిన బాధ్యత ఉన్నత విద్యాలయాలపై ఉందన్నారు. దేశ నలుమూలల నుంచి అధ్యాపకులు, పరిశోధకులను భాగస్వాములను చేయడంతో పాటు నిష్ణాతులైన ఉపన్యాసకులను ఆహ్వానించడం శుభ పరిణామమన్నారు. కోర్సు కోఆర్డినేటర్ ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి పరిశోధన ప్రాముఖ్యత, పరిశోధన అంశాల ఎంపికలో మెళకువలు, పరిశోధన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రామ్‌లాల్, డాక్టర్ రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, అరుణప్రియ, లక్ష్మీప్రభ, శ్వేత, ప్రవళిక, సురేష్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

కేజీబీవీల్లో నిలిచిన బోధన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మూడు రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె బాట

- సద్ది కట్టుకుని వచ్చి కలెక్టరేట్ ఎదుట నిరసన
- ఎన్నికల హామీ అమలు చేయాలని డిమాండ్
- పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో సమ్మెతో విద్యార్థులకు ఇబ్బందులు

నల్లగొండ : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధన నిలిచిపోయింది. సమగ్రశిక్షాలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మూడు రోజులుగా సమ్మె బాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీని ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో ఉద్యోగులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో కేజీబీవీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు విద్యాశాఖలో మండలస్థాయిలో పనిచేసే సిబ్బంది సమ్మె బాట పట్టారు. కేజీబీవీల్లో విద్యార్థుల రక్షణ కోసం ఇద్దరు, ముగ్గురు నాన్ టీచింగ్ సిబ్బందిని అక్కడ ఉంచి అంతా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరసనలో పాల్గొంటున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న ఈ సమయంలో సిబ్బంది సమ్మెతో బోధన అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 1,111 మంది ఉద్యోగులు

జిల్లా వ్యాప్తంగా 27 కేజీబీవీలు ఉన్నాయి. వాటితో పాటు మండలస్థాయిలోనే ఎమ్మార్సీలు, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల స్థాయిలో మొత్తం 10 రకాల ఉద్యోగులు 1,111 మంది సమగ్రశిక్షా పరిధిలో పనిచేస్తున్నారు. వారిలో జిల్లా స్థాయిలో ఏపీఓలు, సిస్టమ్ ఎనాలసిస్టులు, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్లు, డీఎంఎల్‌టీ, మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలు, మెసేంజర్లు, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సీఆర్‌పీలు, పాఠశాల స్థాయిలో పార్టు టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఏఆర్‌టీ, పీఈటీ, వర్క్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన వారున్నారు. కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, క్రాఫ్ట్ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, వంట మనుషులు, వాచ్‌మన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు ఉన్నారు. వీరంతా విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. 18 ఏళ్ల క్రితం వారిని కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని వారు ఆందోళన చేస్తున్నారు.

ఆటలాడుతున్న పిల్లలు

కేజీబీవీల్లో పనిచేసే సిబ్బంది సమ్మె బాట పట్టడంతో బోధన నిలిచిపోయింది. పాఠశాల జరగాల్సిన సమయంలో పిల్లలు ఆటలు ఆడుకుంటున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఉద్యోగుల సమ్మెతో బోధన నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమ్మె విరమింపజేసే వరకు విద్యార్థులు బోధన అందే అవకాశం కనిపించడం లేదు.

కలెక్టరేట్ ఎదుట కొనసాగిన నిరసన..

నల్లగొండ కలెక్టరేట్ గురువారం మూడో రోజు సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన కొనసాగింది. ఉద్యోగులంతా తమ కుటుంబాలతో కలిసి దీక్షలో పాల్గొన్నారు. ఇంటి వద్ద నుంచి భోజనాలు తెచ్చుకుని సమ్మె శిబిరం వద్దే తిన్నారు. సమస్య పరిష్కరించేంత వరకు నిరసన విరమించేది లేదని స్పష్టం చేశారు. సమ్మెకు టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్దన్, తరాల పరమేష్‌యాదవ్, తంతెనపల్లి సైదులు మద్దతు తెలిపారు.



బాక్సులు తెచ్చుకుని సమ్మె శిబిరం వద్ద భోజనం చేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల డిమాండ్లు ఇవే..

- సమగ్రశిక్షా ఉద్యోగులందర్ని రెగ్యులరైజ్ చేయాలి.
- అప్పటి వరకు పే స్కేలు అందించాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలి.
- రిటైర్డ్ అయితే రూ.25 లక్షల బెనిఫిట్ ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలి.
- పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలి.
- సమగ్రశిక్షా ఉద్యోగులకు రీఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.



ప్లకార్డుతో చిన్నారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ఎగుమతులకు అనువైన ఉత్పత్తులపై జిల్లా రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎగుమతుల విధానంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎగుమతులకు అనువైన ఉత్పత్తులు, క్లస్టర్ల అభివృద్ధికి కావాల్సిన పరిస్థితులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహిస్తామని.. అవసరమైన భూమిని తక్కువ రేటుకు ఇస్తామని తెలిపారు. ఎఫ్ఐఈఓ కులకర్ణి మాట్లాడుతూ ఎగుమతులకు అనువైన పరిశ్రమల ఏర్పాటు, వాటి విధానంపై వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్‌కుమార్, హార్టికల్చర్ డీడీ సాయిబాబా, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, స్వయం సహాయక మహిళా సంఘాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో డైట్ చార్జీల పెంపు..

ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ప్రారంభ కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీన పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించి సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లలో మెస్చార్జీల పెంపు కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. డైట్ చార్జిల వివరాలను ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ హాజరయ్యారు.

108ను సద్వినియోగం చేసుకోవాలి

కనగల్ : అధునాతన సౌకర్యాలతో కనగల్ మండలానికి కేటాయించిన అంబులెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె కనగల్ మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. మానిటరింగ్ వ్యవస్థతోపాటు, ఏదైనా పాయిజన్ కేసు వస్తే అంబులెన్స్‌లో చికిత్స అందించే విధంగా సౌకర్యాలు ఉన్నాయన్నారు. అనంతరం సబ్ సెంటర్ల వారీగా మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పద్మ, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

చిట్యాల మార్కెట్ పాలకవర్గం నియామకం



నర్రా వినోద మోహన్‌రెడ్డి, చైర్ పర్సన్

చిట్యాల : చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్‌గా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా వినోదమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా నార్కట్‌పల్లికి చెందిన ఐతరాజు యాదయ్య డైరెక్టర్లుగా రెముడాల యాదయ్య, బూరుగు కృష్ణయ్య, గజ్జెల భాస్కర్, షేక్ కరీం సాబ్ (చిట్యాల), కోనేటి యాదగిరి (ఉరుమడ్ల), దుబ్బాక అరుణ వెంకట్‌రెడ్డి (నేరడ), కొండ ఎల్లయ్య (ఎలికట్టె), లెంకల విజయేందర్‌రెడ్డి (వనిపాకల), దారా యాదయ్య(గోపాలయపల్లి), తొడుజు వీరయ్య (బెండల్‌పహాడ్), బింగి కొండయ్య (తొండ్లాయి), నీరుడు రాంరెడ్డి (ఔరవాణి) ఎన్నికయ్యారు. వీరితో పాటుగా చిట్యాల పీఏసీఎస్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి, వ్యవసాయ శాఖ ఏడీలు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ఈ పాలకవర్గం పదవీకాలం రెండేళ్ల పాటు కొనసాగనుంది. మార్కెట్ చైర్‌పర్సన్‌గా నియామకమైన నర్రా వినోద మోహన్‌రెడ్డి గురువారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ చిట్యాల మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్‌గా గుత్తా మంజుల

నకిరేకల్ : నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ చైర్‌పర్సన్‌గా కేతేపల్లి మాజీ ఎంపీపీ గుత్తా మంజుల మాధవరెడ్డి నియామకం అయ్యారు. వైస్ చైర్మన్‌గా దూలం సోమయ్య(ఓగోడు), డైరెక్టర్లుగా బొల్లెద్దు లక్ష్మయ్య(మంగళపల్లి), మొగిలి బుచ్చయ్య(తాటికల్), బయ్య ముత్తయ్య(కేతేపల్లి), మాందాసు పరశరాములు, ఎస్‌కే.లతీఫ్(గుడివాడ), వరకాంతం శేఖర్‌రెడ్డి (నోముల), గుండు పరమేష్(కట్టంగూర్), పుట్ట నర్సింహారెడ్డి(కలిమెర), కిష్టయ్య(పామనగుండ్ల), కప్పల సైదులు(కొప్పోలు), వ్యాపార ప్రతినిధులుగా గజ్జల వెంకటేశ్వర్లు(నకిరేకల్), తోనుపునూరి రాంబాబు(నకిరేకల్), వీరితో పాటు నకిరేకల్ పీఏసీఎస్ చైర్మన్, నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చైర్‌పర్సన్, మార్కెంటింగ్ శాఖ జిల్లా అధికారి, స్థానిక వ్యవసాయశాఖ ఏడీలు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. నూతనంగా చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, గురువారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిశారు.



చైర్ పర్సన్ మంజులకు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే..

19, 20 తేదీల్లో నల్లగొండలో సైన్స్ ఎగ్జిబిషన్

- డాన్‌బోస్కో పాఠశాలలో ఏర్పాట్లు
- 113 ప్రాజెక్టులతో పాల్గొననున్న విద్యార్థులు

నల్లగొండ : విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు వేళయింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నల్లగొండలో ఈ నెల 19, 20 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో డాన్‌బోస్కో హైస్కూల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయిలో ఎంపికైన 113 ప్రాజెక్టులతో విద్యార్థులు పాల్గొననున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. సైన్స్ ప్రదర్శనతో పాటు.. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శన కూడా నిర్వహించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు ఈ ప్రదర్శనల్లో పాల్గొననున్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచేలా..

విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేలా, సైన్స్‌పై ఆసక్తి పెంచేలా ప్రభుత్వం సైన్స్ ఎగ్జిబిషన్లను నిర్వహిస్తోంది. సైన్స్ టీచర్ల సహకారంతో విద్యార్థుల ఆలోచలను పెంపొందించి.. ప్రజలకు అవసరమైన పరిశోధనలు తయారు చేసే విధంగా కృషి చేస్తోంది. ఇందుకోసం పాఠశాల స్థాయి నుంచే సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది. బాలలకు వచ్చిన ఆలోచనలను ఎగ్జిబిట్‌గా తయారు చేసి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించే అవకాశం కల్పిస్తోంది.

ప్రాజెక్టుల తయారీకి డబ్బు జమ..

జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించేందుకుగాను మండలస్థాయి నుంచి 113 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఆయా ప్రాజెక్టుల తయారీ కోసం ఇప్పటికే సంబంధిత విద్యార్థుల ఖాతాలో ప్రభుత్వం డబ్బులు జమ చేసింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రదర్శన నిర్వహించనున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్, 9 నుంచి 12 వరకు సీనియర్ విభాగాలుగా ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. ఒక్కో ప్రదర్శన వెంట ఒక విద్యార్థి, పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని అనుమతిస్తారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా రెండో రోజు సాయంత్రం 'మిల్లెట్స్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్ అండ్ హెల్త్' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన 113 ప్రదర్శనలు సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనేలా హెచ్ఎంలు బాధ్యత తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 9848578845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు.



సైన్స్‌ఫెయిర్ విద్యార్థులకు ఉపయోగకరం



సైన్స్ ఫెయిర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మారుతున్న కాలంలో వస్తున్న సమస్యలకు పరిష్కారం కనుగొనే విధంగా సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. మంచి ప్రాజెక్టులను తయారీ చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలాసహకరించాలి.

– బి.భిక్షపతి, డీఈఓ

ప్రధాన అంశాలు ఇలా..

సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర, అంశాలపై ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. ప్రధానంగా ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సమాచార రంగం, వ్యవసాయం, సేంద్రియ పద్ధతులు, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, కాంపిటేషనల్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే ఉప అంశాలపై నూతన ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారు. ఉపాధ్యాయులు.. నూతన ఆవిష్కరణలతో కూడిన బోధన, అభాసన సామగ్రిని ప్రదర్శించేందుకు అవకాశం ఉంది. బీఈడీ, డీఈడీ ట్రెయినీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో కూడిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించవచ్చు.

మాకొద్దు.. ఈ ఫ్యాక్టరీ

- ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై తిరగబడుతున్న పది గ్రామాల ప్రజలు
- రోజురోజుకూ ఉధృతమవుతున్న ఉద్యమం
- ఇప్పటికే విత్తనాల ఫ్యాక్టరీ పేరుతో భూసేకరణ
- ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అనుమతులు



రైతుల ధర్నాలో పాల్గొన్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు

కోదాడ: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మోతె మండలంలోని పది గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఇథనాల్ పరిశ్రమ భయంతో కంటిమీద కునుకు రావడం లేదు. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా పంట భూములను బీడు భూములుగా మార్చే ఈ ఫ్యాక్టరీని ఎలా ఏర్పాటు చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిశ్రమ మాకొద్దు అంటూ పది గ్రామాల ప్రజలు ఏకమై ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ఆపివేసే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని తేల్చిచెబుతున్నారు.

గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నా..

మోతె మండలంలోని రావిపహాడ్ గ్రామ సమీపాన 2019లో ఏపీకి చెందిన ఓ పారిశ్రామికవేత్త విత్తనాల కంపెనీ ప్రారంభిస్తామని ప్రజల నుంచి 15 ఎకరాల భూమిని సేకరించారు. కానీ అక్కడ విత్తనాల కంపెనీకి బదులు ఎస్ఎంకే ఇథనాల్ కంపెనీ ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకుని 2022లో పనులు ప్రారంభించారు. వాస్తవానికి ఈ పరిశ్రమ గ్రామాలకు పది కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. సమీప గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయం సేకరించాలి. కానీ ఇవేమీ లేకుండానే గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ఇక్కడ ఫ్యూయల్ ఇథనాల్ మాత్రమే ఉత్పత్తి చేస్తామని చెబుతున్నా తరువాత ఇతర ఉత్పత్తులు ప్రారంభిస్తే పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితమవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసలు సమస్య వ్యర్థ జలాలే..

ఇక్కడ రోజుకు లక్షా 50 వేల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తారని సమాచారం. ఇథనాల్ తయారీకి బియ్యం, నూకలు, మొక్కజొన్న విత్తనాలతో పాటు పాడైన చెరకు ఉపయోగిస్తారు. ఒక్క లీటరు ఇథనాల్ ఉత్పత్తికి 10 లీటర్ల నీరు అవసరమవుతుంది. ఈ నీటిని సమీపంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి తీసుకోనున్నారు. తాగు, సాగునీరు లేక తాము ఇబ్బంది పడుతుంటే పరిశ్రమకు పెద్దఎత్తున నీటిని ఎలా ఇస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇథనాల్ ఉత్పత్తి అనంతరం కలుషితమైన ఈ నీటిని బయటకు వదిలితే తమ పంటపొలాలు పనికి రాకుండా పోతాయని, రకరకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

మేము రోడ్డున పడతాం



ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలను బయటకు వదులుతారు. దీని వల్ల సమీపంలోని నీటి వనరులు, భూగర్భ జలాలు కలుషితమవుతాయి. మాకు తెలియకుండా, మా అభిప్రాయం తీసుకోకుండా దొడ్డిదారిన పరిశ్రమ ఏర్పాటు చేయడం అన్యాయం. ఈ పరిశ్రమ ప్రారంభిస్తే రైతులు రోడ్డున పడతారు. ఎట్టి పరిస్థితిలో ఏర్పాటు చేయనీయం.

– కాకి నారాయణరెడ్డి, రైతు, రావిపహాడ్

అనుమతులు రద్దు చేయాలి

మోతె: ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మోతె మండలంలోని రావిపహాడ్ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు రైతులు, సీపీఎం, న్యూడెమోక్రసీ పార్టీలు మద్దతు తెలిపాయి. ధర్నాతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో పోలీసులు రైతులు, నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా

2.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నేరేడుచర్ల పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన కాంద్రకొండ శాంతమ్మ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అశోక లేలాండ్ వాహనంలో తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు బుధవారం నేరేడుచర్ల మండలం పుల్లంబండతండా శివారులో పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 2.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శాంతమ్మతో పాటు వాహన డ్రైవర్ ఎస్‌కే నాగుల్‌మీరా, వేముల నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

చివ్వెంల(సూర్యాపేట): ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కొండలపాలెం గ్రామానికి చెందిన మెరికినపల్లి ఇందిర (45) హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు బుధవారం బస్సులో వెళ్తోంది. ఈ క్రమంలో చివ్వెంల మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ శివారులోని సాయికృష్ణ హోటల్ వద్దకు రాగానే బస్సు చార్జింగ్ అయిపోవడంతో అక్కడే ఉన్న పవర్ పాయింట్ వద్ద బస్సు చార్జింగ్ పెడుతుండగా, మూత్రవిసర్జన కోసం బస్సు దిగిన ఇందిర రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న తణుకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి అల్లుడు గడ్డం రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

తల్లి, కుమార్తె అదృశ్యం


ఝాన్సీ

త్రిపురారం: తల్లి, కుమార్తె అదృశ్యమైనట్లు గురువారం నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన జెర్రిపోతుల నర్సింహ, ఝాన్సీ(28) దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పత్తి కట్టె తొలగించే విషయమై ఇటీవల భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఈ నెల 7వ తేదీన ఉదయం నర్సింహ కూలీ పనులకు వెళ్లగా సాయంత్రం ఝాన్సీ తన చిన్న కుమార్తె శ్రీజ(7)ను తీసుకుని ఐకేపీ సెంటర్‌కు వెళ్లొస్తానని పక్కంటి వారి చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె దగ్గర ఉన్న ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో జెర్రిపోతుల నర్సింహ గురువారం నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘ఆదర్శ’ ఉపాధ్యాయుల నిరసన బాట

- తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
- జనవరి 4వ తేదీ వరకు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ


నిడమనూరు ఆదర్శ పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్: తమ సమస్యల పరిష్కారానికి సూర్యాపేట జిల్లాలోని ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన బాట పట్టారు. గురువారం నుంచి జనవరి 4వ తేదీ వరకు వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు తెలియజేయనున్నారు. మొదటి రోజు భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా వ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో నిరసన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 33 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 600 మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

ఇవీ డిమాండ్లు..

ఆదర్శ పాఠశాలలను పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో విలీనం చేయాలి. ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు అందజేయాలి. ఒకే నోటిఫికేషన్ కింద ఎంపికైనప్పటికీ రెండో దశ నియామకమైన ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు మెమో ప్రకారం మొదటి దశ వారితో సమానంగా నోషనల్ సర్వీస్, నోషనల్ ఇంక్రిమెంట్ వర్తింపజేయాలి. హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలి. సీపీఎస్ డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ అందించాలి. ప్రమోషన్లు వెంటనే చేపట్టి పెండింగ్ బకాయిలు చెల్లించాలి.

దశల వారీగా నిరసన కార్యక్రమాలు

- ఈ నెల 12, 13, 16, 17 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి, భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన.
- 18వ తేదీన మండల స్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేత
- 19, 20వ తేదీల్లో భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓ, డీఐఈఓలకు వినతి పత్రాలు అందజేత
- 21, 22, 23 తేదీల్లో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రులకు వినతి పత్రాలు అందజేయడం.
- 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఒక రోజు దీక్ష, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడం.
- జనవరి 4న రాష్ట్ర హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి



ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. 010 పద్దు కింద వేతనాలు, నోషనల్ సర్వీస్, చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు, ప్రమోషన్లు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి.

– గుండగాని రాజయ్యగౌడ్, ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

విద్యా శాఖలో విలీనం చేయాలి



ప్రభుత్వం వెంటనే స్పందించి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలి. ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేయాలి. సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారం కోసం ఈ కార్యాచరణ చేపట్టాం.

– ఎం. తరాల జగదీష్, ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంక్రిమెంట్ ఇచ్చి న్యాయం చేయాలి



ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. రెండో దశలో నియామకమైన ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన నోషనల్ సర్వీస్ ఇంక్రిమెంట్ అందించి న్యాయం చేయాలి.

– మహ్మద్ ఖలీల్ అహ్మద్, పీఎంటీఏ–టీఎస్ స్టేట్ జాయింట్ సెక్రటరీ

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం


మహేష్ (ఫైల్)

చిట్యాల: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతితో మనస్పర్థలు రావడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గురువారం జరిగింది. చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం గ్రామానికి చెందిన చిర్రబోయిన మహేష్(26) ఇంటర్ వరకు చదివి తన తండ్రి మల్లయ్యతో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మహేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి రెండు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. అనంతరం కొద్దిరోజులకే వారిద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో ఈ నెల 11వ తేదీన పెద్దమనుషుల సమక్షంలో విడిపోయి ఎవరింట్లో వారు ఉంటున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ గురువారం ఉదయం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ కాల్వలో దూకి గల్లంతైన యువకుడు


లావూరి శివ

వేములపల్లి: నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో దూకి యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన గురువారం వేములపల్లి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం బొల్లిగుట్టతండాకు చెందిన లావూరి శివ గురువారం ఉదయం మిర్యాలగూడకు వచ్చి అక్కడి నుంచి ఆటోలో వేములపల్లి మండల కేంద్రానికి చేరుకున్నాడు. శివ ఆటోలో ఉండగా ఆటో డ్రైవర్ చాపల మనోజ్ ఫోన్ అడిగి దాని నుంచి తన అక్క శారదకు తాను వేములపల్లి వద్ద సాగర్ ఎడమ కాల్వలో దూకి చనిపోతున్నట్లు మెసేజ్ పంపాడు. అనంతరం ఫోన్‌ను ఆటోలోనే ఉంచి వేములపల్లి మండల కేంద్రంలో దిగాడు. మెసేజ్ చూసుకున్న శివ అక్క శారద తిరిగి ఫోన్ చేయగా ఆటో డ్రైవర్ చాపల మనోజ్ ఫోన్ లిఫ్ట్ చేసి తాను శివను వేములపల్లిలో దింపి నల్లగొండకు వెళ్తున్నట్లు తెలిపాడు. తన తమ్ముడు సాగర్ ఎడమ కాల్వలో దూకి చనిపోతున్నట్లు తనకు మెసేజ్ చేశాడని చెప్పగా.. ఆటో డ్రైవర్ వెంటనే సాగర్ ఎడమ కాల్వ వద్దకు చేరుకుంటుండగా అప్పటికే శివ కాల్వలో దూకాడు. ఇదంతా మనోజ్ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి కుటుంబ సభ్యులకు పంపించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న శివ కుటుంబ సభ్యులు కాల్వ వెంట గాలించినప్పటికీ శివ ఆచూకీ లభ్యం కాలేదు. శివ తండ్రి బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నరసింహారావు తెలిపారు. శివ ప్రస్తుతం భువనగిరి పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్నాడని, సివిల్స్ పరీక్షకు ఇంటి వద్దనే సన్నద్ధమవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై ఉచిత శిక్షణ

సూర్యాపేట: సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి గల రైతులకు ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం చేగూరు గ్రామంలోని శ్రీరామచంద్ర మిషన్ వారి కన్హా శాంతివనంలో పది రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు విశ్వ కళ్యాణ్ సంరక్షణ సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు పదివేల మందికి ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్, విజయ రామారావు సమక్షంలో వసతి, భోజనంతో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణకు వచ్చే రైతుల నుంచి రూ.15వేలు డిపాజిట్ అమౌంట్‌గా తీసుకుని సేంద్రియ వ్యవసాయం చేయడానికి ఆవులను ఇస్తున్నట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి గల రైతులు శిక్షణకు హాజరు కావాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

మఠంపల్లి: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన గురువారం మఠంపల్లి మండలం మంచ్యాతండాలో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మంచ్యాతండాకు చెందిన మాలోతు రాంబాబునాయక్ గురువారం తన రెండు పాడి గేదెలను మేత కోసం పొలం వద్దకు తీసుకెళ్లగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగలకు గేదెలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. సుమారు రూ.లక్ష నష్టపోయానని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాంబాబునాయక్‌ను ట్రాన్స్‌కో అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు భూక్యా భక్షానాయక్ డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

- రూ.30లక్షల ఆస్తి నష్టం


కాలిబూడిదైన ఇంట్లోని వస్తువులు

కోదాడరూరల్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన కోదాడ పట్టణంలోని సాయినగర్‌లో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌లో నివాసముంటున్న తొగరు సైదయ్య సూర్యాపేటలోని ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అయ్యప్ప మాల ధరించిన సైదయ్య గురువారం ఇంట్లో దీపం వెలిగించి కుటుంబ సభ్యులతో కలిసి సూర్యాపేటలోని అయ్యప్ప దేవాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఇంటి నుంచి దట్టమైన పొగతో మంటలు రావడంతో స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో పాటు సైదయ్యకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చేటప్పటికి ఇంట్లో ఉన్న రూ.30లక్షల విలువైన టీవీలు, ఫ్రిజ్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్ కాలిబుడిదయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దీపం వలనా లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలని ధర్నా


ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అభ్యర్థులు

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కేర్ టేకర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ముగ్గురిని ఫైనల్ లిస్టుకు ఎంపిక చేసి, వారిని కాదని మరొకరిని ఉద్యోగం ఇవ్వడంతో ముగ్గురు అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని గురువారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆదర్శ పాఠశాలలో కేర్ టేకర్ కాంట్రాక్టు ఉద్యోగానికి నోటిఫికేషన్ వేయడంతో చాలామంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ బీఈడీ చేసిన జెట్టి మహేశ్వరి, బర్ల స్వాతి, బాకరం ధనమ్మను మెరిట్ ప్రకారం ఫైనల్ లిస్టుకు ఎంపిక చేశారు. వారిని ఇంటర్వ్యూకు కూడా పిలిచారు. ముగ్గురిలో ఒకరికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గత నెల 23వ తేదీ నుంచి తిరుగుతున్నా ఎంఈఓ పట్టించుకోవడం లేదని, తమ ముగ్గురిలో ఒకరికి రావాల్సిన ఉద్యోగాన్ని వేరొకరికి ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయమై ఎంఈఓ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఫైనల్ లిస్ట్ డీఈఓ కార్యాలయానికి పంపించామని, ఎంపిక విషయం తనకు తెలియదని, స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

బైక్, స్కూల్ బస్సు ఢీ.. ముగ్గురికి గాయాలు

సంస్థాన్ నారాయణపురం: బైక్, స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం డాకుతండాకు చెందిన కరెంటోత్ రాజేష్, దిలీప్, వెంకటేశం బైక్‌పై వెళ్తుండగా.. గట్టుప్పల్‌లోని కల్మరాం గుర్కా విద్యాదాయిని పాఠశాల బస్సు విద్యార్థులను తమ ఇళ్ల వద్ద విడిచిపెట్టి తిరిగి గట్టుప్పల్ తిరిగి వెళ్తూ లచ్చమ్మగూడెం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజేష్‌కు కాళ్లు విరిగాయి. దిలీప్, వెంకటేశంకు స్వల్ప గాయాలన్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


కావ్య

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలంలోని జైకేసారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు గురువారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జైకేసారం గ్రామానికి చెందిన గంగాదేవి కావ్య(18) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఎంబీహెచ్‌డబ్ల్యూ చదివింది. గత కొద్దిరోజులుగా ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉద్యోగం వెతుక్కుంటానని ఈ నెల 8వ తేదీన ఇంట్లో చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కావ్య తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తెలంగాణలో మార్పు బీజేపీతోనే సాధ్యం

- భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

తుంగతుర్తి: బీజేపీతోనే తెలంగాణ రాష్ట్రంలో మార్పు సాధ్యమని భువనగిరి మాజీ ఎంపీ, బీజేపీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 66 అబద్ధాలు, 6 హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2500, రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్ష, తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్క దానిని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లెపాక సాయిబాబా, యశ్వంత్, బీజేపీ నాయకులు గాజుల మహేందర్, సంజీవరెడ్డి, రమేష్, వెంకటనారాయణగౌడ్, అంబటి రమేష్, కత్తుల నరేష్, అంజయ్య, సత్యనారాయణ, ఉప్పల లింగయ్య, పెండెం యాదగిరి, రఫీక్, బండి అంతయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


లింగస్వామి (ఫైల్)

రామన్నపేట: కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటన రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్నేనిగూడెం గ్రామానికి చెందిన బర్మ సత్యనారాయణకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన లింగస్వామి(24) వ్యవసాయ పనులతో పాటు ఓ ప్రైవేట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి సంవత్సరం క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అపెండిక్స్ ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. బుధవారం కడుపునొప్పి తీవ్రమవ్వడంతో నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఊర్లో ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి సోదరుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

మైనర్‌లను కొట్టారని తల్లిదండ్రుల ధర్నా


పోచంపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత పిల్లల తల్లిదండ్రులు

భూదాన్‌పోచంపల్లి: మైనర్‌లను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఎస్‌ఐ తీవ్రంగా కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి పిల్లల తల్లిదండ్రులు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల తల్లిదండ్రులు మాట్లాడుతూ భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో బుధవారం సాయంత్రం కొందరు పిల్లలు గొడవ పడ్డారని అన్నారు. దీంతో గురువారం తెల్లవారుజామున పోలీసులు ఇంటి నుంచి నక్క బన్నీ, నక్క సిద్దు, మొగిలిపాక అక్షయ్, మొగిలిపాక చరణ్, జింక సాయిచరణ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారని తెలిపారు. దాంతో తామంతా ఆందోళన చెంది విషయం ఏమిటో తెలుసుకుందామని ఉదయం 8గంటలకు పోలీస్‌స్టేషన్‌కు రాగా.. ఎస్‌ఐ లేరని స్టేషన్‌లోనే సాయంత్రం వరకు కూర్చోబెట్టుకున్నారని తెలిపారు. సాయంత్రం స్టేషన్‌కు వచ్చిన ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి పిల్లలందరినీ తమ కళ్లెదుటే చితకబాదారని బాధిత పిల్లల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగితే తమను కూడా పోలీస్‌స్టేషన్ బయటకు గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నాలో మొగిలిపాక పరమేశ్, సురేశ్, మహేశ్, నక్క నరేశ్, పోషయ్య, లింగస్వామి, కోట శేఖర్, వడ్డేపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ఘటనపై ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి వివరణ ఇస్తూ ఇంద్రియాల గ్రామానికి చెందిన ఆ యువకులంతా గ్యాంగ్‌గా ఏర్పడి గొడవలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వారికి భయం పెట్టాను తప్ప కొట్టలేదని అన్నారు.

‘నా బిడ్డను నేనే సాదుకుంటా..’

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట మహిళ వివరణ


చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు చిన్నారి తల్లి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణానికి చెందిన ఓ మహిళకు 17 ఏళ్ల కుమార్తె ఉంది. సదరు మహిళకు గత నెలలో మరో పాపకు జన్మించింది. ఆ పాప రెండు రోజులుగా కనిపించకపోవడంతో శిశువును ఓ జంటకు అమ్మినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. దీంతో రంగంలోకి దిగిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్మన్ బండారు జయశ్రీతో పాటు కమిటీ సభ్యులు పాప ఆచూకీ కనిపెట్టి, పాపను తీసుకెళ్లిన వారిని, కన్నతల్లిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పాపను తల్లికి అప్పగించారు. సదరు మహిళ ఈ నెల 9వ తేదీన సిద్దిపేట జిల్లాలోని చేర్యాలలో తన బాబాయి ఇంటికి ఇద్దరు కుమార్తెలను తీసుకొని వెళ్లింది. అక్కడ తన ఆరోగ్యం బాగోలేకపోవడంతో పెద్ద కుమార్తెను తీసుకుని భువనగిరికి తీసుకుని వచ్చినట్లు తెలిపింది. తాను చిన్నారిని అమ్మలేదని కొన్నిరోజులు తమ బంధువుల వద్ద ఉంచినట్లు సదరు మహిళ పేర్కొంది. ఈ లోపే స్థానికులంతా పాపను అమ్ముకున్నానని ప్రచారం చేశారని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. పాపను తన వద్దే ఉంచుకుంటామని తెలిపింది. కాగా ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని బాలల సంరక్షణ అధికారికి సీడబ్ల్యూసీ సభ్యులు ఆదేశించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు రోహిత, ఇస్తారి, శివరాజ్, మల్లేష్, దశరథ ఉన్నారు.

వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా


మాట్లాడుతున్న వికాస్ భాటియా

బీబీనగర్: వైద్య వృత్తిని ఎంచుకున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో నూతన ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులకు గురువారం వైట్ కోట్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు, వైద్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ.. డాక్టర్ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వైద్య వృత్తిలో ఎప్పటికప్పుడు కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాభ్యాసం, వైద్య సేవలు, రోగుల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాహుల్‌నారంగ్, నితిన్ అశోక్‌జాన్, సుబ్బయ్య షణ్ముకం, వసంత కామత్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించే వరకూ పోరాటం ఆపొద్దు


ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

భువనగిరి, భువనగిరిటౌన్: మినిమం టైం స్కేల్ సాధించే వరకు పోరాటం ఆపొద్దని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన గురువారం మద్దతు ప్రకటించి మాట్లాడారు. పోరాటాల ద్వారానే డిమాండ్లను సాధించుకోవాలన్నారు. ఉద్యమాన్ని నీరు కార్చేందుకు ప్రభుత్వం అధికారవర్గాల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తారని, మినిమం టైం స్కేల్ వచ్చేవరకు తగ్గేదే లేదు అని అన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం మాట్లాడుతూ.. ఏ ఉద్యమమైనా ముందుకు సాగాలంటే ఐక్యత పెరగాలన్నారు. అనంతరం డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుంకోజు భాస్కర్ మాట్లాడుతూ.. కేజీబీవీ టీచర్లు, సమగ్ర శిక్షా ఉద్యోగులు ఏళ్ల తరబడి పనికి తగిన వేతనం పొందలేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సమ్మె సందర్భంగా ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సాయం చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ గురువారం స్థానిక రాయగిరిలోని విద్యా జ్యోతి హైస్కూల్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి రమేష్, సదానందగౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.